క్లుప్తంగా

పూర్ణాహుతితో ముగిసిన శ్రీ దేవి శరన్నవరాత్రోత్సవాలు



పెదకాకాని: పెదకాకాని శివాలయంలో తొమ్మిదిరోజులుగా నిర్వహిస్తున్న దేవిశరన్నవరాత్రోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆయా ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, వేదపండితులతో పూర్ణాహుతి కార్యక్రమం, శమీపూజ జరిపించారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులను అనుగ్రహించారు.

తండ్రి అంత్యక్రియలు నిర్వహించిన కూతురు

గుంటూరు రూరల్: కూతురే కొడుకై ఖర్మకాండలు చేసిన ఘటన శనివారం మండలంలోని గోరంట్లలో చోటు చేసుకుంది. రూరల్ మండలం గోరంట్ల గ్రామంలో నివసించే బాబ్జి(47) పల్నాడు జిల్లా పిడుగురాళ్లలోని విద్యుత్ కార్యాలయంలో ఏడీఏగా పనిచేస్తున్నారు. ఆయన శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. నివాసం వద్ద నుంచి ఖర్మకాండలు చేసేందుకు కొడుకు లేకపోవటంతో శనివారం ఆయన ఖర్మకాండలను పెద్దకుమార్తె జాహ్నవి నిర్వహించింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుంటూరు రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. సుమారు 40 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి గోరంట్ల గ్రామంలోని పోలేరమ్మతల్లి ఆలయం సమీపంలో మృతి చెంది పడిఉన్నాడని సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడు ఎరుపు నలుపు రంగు కలిగిన బ్లాక లర్ చొక్కా, నల్లరంగు ప్యాంటు ధరించి ఉన్నాడని ఆమోకీ తెలిసినవారు నేరుగా నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

గుంటూరు రూరల్: పట్టభద్రులు తమ ఓటు నమోదు చేసుకోవాలని జిల్లా వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఆవుల సుదర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 6వ తేదీలోగా తమ ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. పాత ఓట్లు లిస్టు ఉండదని అందరూ మళ్లీ నూతనంగా ఓటు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఫారం 18 ప్రకారం అవసరమైన ధ్రువపత్రాలను అందజేసి ఆన్‌లైన్‌లో కానీ, ఆఫ్‌లైన్ విధానంలో అయితే తహసీల్దారు కార్యాలయంలో ఓటు నమోదు చేసుకుని రసీదును పొందవచ్చని తెలిపారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

పట్నంబజారు: ఈ నెల 17వ తేదీ పౌర్ణమిని పురస్కరించుకుని శివభక్తుల కోసం అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం ఎం.రవికాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ రాత్రి గుంటూరులో బస్సు బయలుదేరుతుందని, 16న శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని అదే రోజు రాత్రి బయలుదేరి 17వ తేదీ ఉదయం అరుణాచలం చేరుకుంటుందని వివరించారు. గిరి ప్రదక్షిణ, స్వామి వారి దర్శనం అనంతరం సాయంత్రం తిరిగి బస్సు బయలుదేరి 18 ఉదయం గుంటూరుకు వస్తుందని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. టికెట్ ధర రూ.2,420గా పేర్కొన్నారు. వివరాల కోసం 7382896403కు సంప్రదించాలని కోరారు.

16 నుంచి ఈశా ఫౌండేషన్ ఇన్నర్ ఇంజినీరింగ్

నగరంపాలెం: ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థ ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 22 వరకు ఇన్నర్ ఇంజినీరింగ్ (తెలుగులో) అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈశా వలంటీర్ సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 99493 12299 లో సంప్రదించాలని చెప్పారు.

గాయని సంగీత మెలేకర్‌కు సత్కారం

నగరంపాలెం: స్థానిక మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం కళాదర్బార్–అమరావతి ఆధ్వర్యంలో ప్రముఖ హిందీ స్టార్ గాయని సంగీత మెలేకర్ మెగా మ్యూజికల్ నైట్ నిర్వహించారు. కార్యక్రమానికి కళా దర్బార్ వ్యవస్థాపక అధ్యక్షులు పాత్తూరి రంగారావు అధ్యక్షత వహించారు. గాయని గాయకులు అనూష, ఇందునైన, శైలజ, పావని, జ్యోతిర్మయి, మురళీకృష్ణ, రామ్‌దాస్, షహన్‌వాజ్, శివకుమార్, బాబూరావు, అబ్దుల్‌ఖాదర్ హిందీ పాటలను ఆలపించారు. ప్రేక్షకులను అలరించాయి. ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్, మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు ప్రసంగించారు.

సరసమైన ధరలు.. అంతా షో

నూనెలు సలసల..

- ప్రత్యేక కౌంటర్లలో తగ్గింపు ధరలకు నూనె విక్రయాలంటూ ఫ్లెక్సీలు
- ఒకరిద్దరికి విక్రయించినట్లు అధికారులు, టీడీపీ నాయకులు ఫొటోలకు ఫోజులు
- వాళ్లు వెళ్లగానే ఫ్లెక్సీలు పీకి పక్కనేసిన వ్యాపారులు
- మాకు ప్రభుత్వం చెప్పిన ధరలకు గిట్టుబాటు కావంటూ గగ్గోలు



ఇక్కడ కనిపిస్తున్న ఈ చిత్రాన్ని చూడండి. ఒక చిత్రం పెదనందిపాడులోనిది. ఈ నెల 11వ తేదీన 'సరసమైన ధరలకే వంటనూనెలు' అంటూ చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ ఫొటోలతో ఓ దుకాణం వద్ద అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ఒకరిద్దరికి టీడీపీ నాయకుల ద్వారా నూనె ప్యాకెట్లు ఇప్పించారు. వాళ్లు అలా వెళ్లారో లేదో వ్యాపారులు ఇలా ఫ్లెక్సీని పీకి పక్కనపడేశారు.



ప్రత్తిపాడు: బహిరంగ విపణిలో వంటనూనెల ధరలు సలసల కాగిపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆయిల్స్‌పై సుకం పెంచడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయి. లీటరు పామాయిల్ ధర మొన్నటి వరకు రూ.90 ఉండగా ఇప్పుడు రూ.125, సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర రూ.110 ఉండగా ప్రస్తుతం రూ.138కి ఎగబాకింది.

దీంతో ప్రజలపై ఆర్థిక భారం పడుతుంది. దానికి తోడు కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి నూనెల ధరలను అమాంతంగా పెంచేస్తున్నారు. ఇంకొందరు హోల్‌సేల్ వ్యాపారులు తమ వద్ద ఉన్న పాత స్టాక్‌ను సైతం కొత్త రేట్లుకు రిటైల్ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. దీంతో రిటైల్ వ్యాపారులు మరికొంత లాభం చూసుకుని అధిక ధరలకు నూనెల విక్రయాలు సాగిస్తున్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు విక్రయాలెక్కడ..

పెరిగిన వంటనూనెలపై కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించిందని, వ్యాపారులు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే వంటనూనెలు విక్రయించాలంటూ అధికారులు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం లీటరు పామాయిల్ రూ.110, లీటరు సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124కు విక్రయించాలి. కానీ ఈ ధరలకు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరురూరల్ మండలాల్లో ఎక్కడా నూనెల విక్రయాలు జరగడం లేదు. హోల్‌సేల్ డీలర్లు వ్యాపారులకు సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు రూ.138, పామాయిల్ రూ.125కు సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సూచించిన ప్రకారం విక్రయిస్తే వ్యాపారుల గల్లాకు కన్నం పడుతుంది. దీంతో వ్యాపారులు వారి ఇష్టానుసారంగా నూనెలను విక్రయిస్తున్నారు.

స్పెషల్ కౌంటర్లంటూ ఫొటోలకు స్టిల్స్..

సివిల్ సప్లై అధికారులు మండల కేంద్రాల్లో కొన్ని దుకాణాల వద్ద స్పెషల్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. అక్కడ 'సరసమైన ధరలకే వంటనూనెలు' అంటూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి తగ్గింపు ధరలకు నూనెలు విక్రయిస్తున్నట్లు తెలుగుదేశం, జనసేన నాయకులతో కలసి ఫొటోలకు స్టిల్స్ ఇచ్చారు. అనంతరం వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అంతే కొందరు వ్యాపారస్తులు వారు కట్టిన ఫ్లెక్సీలను తొలగించగా, మరికొందరు ప్రభుత్వం నిర్దేశించిన ధరలతో ఉన్న ఫ్లెక్సీలను మూటకట్టి పైకి మడతేశారు. దీంతో నిర్దేశిత ధరలకు నూనెల విక్రయాలు నిలిచిపోయాయి.



ప్రత్తిపాడులోని ఓ కిరాణా దుకాణం వద్ద మడతపెట్టి పైకి కట్టిన 'సరసమైన ధరలకే వంటనూనెలు' ఫ్లెక్సీ

- ఇది ప్రత్తిపాడులోని చిత్రం. సీఎస్ డీటీ, వీఆర్వోలు, తెలుగుదేశం, జనసేన నాయకలు అందరూ కలిసి బస్టాండు ఎదురునున్న ఒక కిరాణా దుకాణంలో తగ్గింపు ధరలకే నూనెల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఒకరిద్దరికి నూనె ప్యాకెట్లు పంపిణీ చేశారు. వాళ్లు అలా వెళ్లగానే వీళ్లు ఇలా ఫ్లెక్సీని మడతపెట్టి పైకి కట్టేశారు. పై రెండు చిత్రాలు అధికారుల నూనె షోను కళ్లకు కడుతుంది.

ఆర్టీసీ బస్సు నుంచి పొగలు



ప్రత్తిపాడు: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. బస్సు నుంచి ఒక్కసారిగా పొగలు రావడంతో ప్రయాణికులు భయంతో బయటకు పరుగులు పెట్టిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. ఆదివారం రాత్రి గుంటూరు నుంచి ప్రత్తిపాడు మీదుగా పర్చూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు రేడియేటర్‌లో నీళ్లు ఆవిరి అవ్వడంతో బస్సు నుంచి ఒక్కసారిగా పొగలు చెలరేగాయి. గమనించిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ బస్సును ప్రత్తిపాడు బస్టాండు వద్ద నిలిపివేశారు. అప్పటికే తీవ్ర భయాందోళనకు గురైన ప్రయాణికులు బస్సు నుంచి ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 46 మంది ఉన్నారు. అయితే డ్రైవర్ అప్రమత్తం అవ్వడంతో ప్రయాణికులకు ప్రమాదం తప్పింది.

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా ముగిసిన దేవీశరన్నవరాత్రులు

దసరా పర్వదినాన భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

ప్రత్తిపాడు: విజయదశమిని పురస్కరించుకుని మండల పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. విజయదశమి పర్వదిన వేడుకలు శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. స్థానిక గంగా పార్వతీ సమేత దండేశ్వరాలయంలో పార్వతిదేవి అమ్మవారు పుష్పశయ్య అలంకారంలో భక్తులను విశేషంగా అలరించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో లోకమాతకు నీరాజనాలు పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్తిపాటి పరమేశ్వరశర్మ అమ్మవారిని దూపదీప నైవేద్యాలతో వైభవంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు ఇచ్చారు. ఏటుకూరు అమ్మవారి దేవాలయంలో లోకమాతను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

- వేణుగోపాల స్వామి సీతారామ స్వామి వార్ల దేవస్థానంలో అమ్మవారికి అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు.
- పరమేశ్వరస్వామి దేవాలయంలో పరమేశ్వరుడికి పొంగళ్లు పెట్టుకుని పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. తమ కోరికలు తీర్చాలంటూ స్వామివారిని వేడుకున్నారు.
- ప్రత్తిపాడు అంకమ్మతల్లి దేవస్థానంలో సాంస్కృతిక నృత్య ప్రదర్శన నిర్వహించారు. యువతులు, చిన్నారులు కనకదుర్గమ్మ గీతాలకు, ఆధ్యాత్మిక పాటలకు సంప్రదాయబద్ధంగా చేసిన నృత్యాలు అలరించాయి. ఉత్తమ ప్రదర్శన చేసిన వారికి బహుమతులు అందించారు.
- కొత్తమల్లాయపాలెంలోని అమ్మవారి దేవాలయంలో, గొట్టిపాడులోని కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో, ప్రత్తిపాడు రెడ్ల రామాలయం, అద్దంకమ్మ తల్లి ఆలయంతో పాటు పలు రామాలయాల్లో భక్తులు దసరా పర్వదినాన అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిపారు.
- పాతమల్లాయపాలెం ఆంజనేయస్వామి దేవాలయం, చినకోండ్రుపాడు రామలింగేశ్వరస్వామి దేవాలయంలో దసరా పర్వదినాన సెమీ పూజతో పాటు గ్రామోత్సవాలను నిర్వహించారు.
- పోలీస్ స్టేషనులో ఎస్ఐ కె.నాగేంద్ర సిబ్బందితో కలసి ఆయుధ పూజ చేశారు.

నిమజ్జనానికి కనకదుర్గమ్మ..

గుంటూరు పర్చూరు రోడ్డులో రజక రామాలయం వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహాన్ని మేళ తాళాల నడుమ శనివారం రాత్రి నిమజ్జనానికి తరలించారు. ఉదయం దసరా పర్వదిన ప్రత్యేక పూజలు చేశారు. భక్తజన కోలాహలంతో మహిళల కోలాటాలతో అమ్మవారు ఊరేగింపుగా గ్రామ పురవీధుల్లోనికి తరలివచ్చారు. మహిళలు వారులు పోసి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.



కొత్తరెడ్డిపాలెంలో కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజ అనంతరం భక్తులతో అంబటి మురళీకృష్ణ



నవరాత్రులను ముగించుకుని నిమజ్జనానికి తరలివెళ్తున్న కనకదుర్గమ్మ



అంకమ్మతల్లి దేవాలయంలో నృత్య ప్రదర్శన చిన్నారులతో నిర్వాహకులు

ఘనంగా దసరా ఉత్సవాలు

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో శనివారం దసరా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని మంచాల గ్రామంలో రాజరాజేశ్వరి దేవిగా ఆదిలక్ష్మి కామేశ్వరి అమ్మవారు దర్శనమిచ్చారు. శలపాడులో కనకదుర్గమ్మ అమ్మవారి గ్రామోత్సవంగా వైభవంగా నిర్వహించారు. మంచాల గ్రామంలోని రామమందిరం వద్ద కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేకపూజలు హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చేబ్రోలు మండలం శలపాడులో గ్రామోత్సవంలో కనకదుర్గమ్మ అమ్మవారు

కనకదుర్గమ్మ అమ్మవారికి అంబటి పూజలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో దసరా ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గమ్మ అమ్మవారికి వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తరెడ్డిపాలెం గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో స్థానిక భక్త బృందం ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దసరా ఉత్సవాల్లో ప్రతి రోజు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అంబటి మురళీకృష్ణ వెంట స్థానిక ఎంపీటీసీ ఇంటూరి జయపాల్‌రెడ్డి, శేషిరెడ్డి, బి.రాజశేఖరరెడ్డి, ఎం.నాగిరెడ్డి, కేశవరెడ్డి, పి.కోటేశ్వరరావు, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా విజయదశమి పూజలు

పొన్నూరు: దసరా ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. నియోజకవర్గంలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణాలతో పాటు వీధుల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక మంటపాల్లో 9 రోజులుగా ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దసరా సందర్భంగా ఆలయాల్లో అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పట్టణంలోని తోటమ్మతల్లి ఆలయం, తెలగపాలెం కోదండ రామాలయం, నిడుబ్రోలు రైలుపేట రెల్లి కమిటీ, తదితర ఆలయాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నిడుబ్రోలు అభయ వీరాంజనేయ యూత్ ఆధ్వర్యంలో కనకదుర్గమ్మతల్లి ఉత్సవ విగ్రహం ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, కోలాటం, నృత్యాలు ఆకట్టుకున్నాయి.




ప్రత్తిపాడు దండేశ్వరాలయంలో పుష్పశయ్య అవతారంలో పార్వతీదేవి



ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో ఆయుధపూజ చేస్తున్న ఎస్ఐ నాగేంద్ర



పొన్నూరు రైలుపేటలో విశేష అలంకరణలో అమ్మవారు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు..

కుమ్మేసిన వాన..



చినకోండ్రుపాడు - నడింపాలెం మధ్య లోలెవల్ చప్టా ఉప్పొంగడంతో ప్రజలు, వాహనదారులను సురక్షితంగా ఒడ్డుకు చేరుస్తున్న స్థానికులు

ప్రత్తిపాడులో శనివారం మధ్యాహ్నం వర్షం కుమ్మేసింది. మురుగు కాలువల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో పాటు పూడిక నిండిపోవడంతో వర్షం నీరు, మురుగు నీరు రోడ్లపైకి చేరింది. దీంతో స్థానిక పాత పోస్టాఫీసు రోడ్డు, మసీదు రోడ్డు, బస్టాండు సెంటరు, గుంటూరు-పర్చూరు పాత మద్రాసు రోడ్డులోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నడింపాలెం సమీపంలోని కొండల్లో అధిక వర్షంక కురవడంతో రామవాగు, కొండవాగులు ఉప్పొంగి చినకోండ్రుపాడు- నడింపాలెం మధ్య ఉన్న లోలెవల్ చప్టాపై వర్షపు నీరు ప్రవహించింది. దీంతో కొంతసేపు రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నీటి ఉధృతి తగ్గిన తరువాత గ్రామస్తులు వాహనాలు, ప్రజలను సురక్షితంగా అవతలి వైపుకు చేర్చారు. – ప్రత్తిపాడు



పాతపోస్టాఫీసు రోడ్డులో జలమయమైన సిమెంట్ రోడ్డు



మురుగు కాలువలు నిండి రోడ్డుపైకి చేరిన వర్షపునీరు



గుంటూరు- పర్చూరు రోడ్డులో ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయం ఎదుట అవస్థలు

కళలు, కళారూపాలు లేకపోతే సమాజమే కాదు

- హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి
- ఘనంగా శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం వార్షికోత్సవ సభ



విజేతలతో అతిథులు

నగరంపాలెం: కళలు, కళారూపాలు లేని సమాజం సమాజమే కాదని ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి అన్నారు. ఆదివారం లక్ష్మీపురం శ్రీత్యాగరాజస్వామి కళావేదికపై శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం 46వ వార్షికోత్సవ సందర్భంగా సంగీత మహోత్సవాలు నిర్వహించారు. సభకు సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ అధ్యక్షత వహించారు. జస్టిస్ శేషసాయి, అర్చక అకాడమీ పూర్వ డైరెక్టర్ డాక్టర్ వేదాంతం రాజగోపాల్ చక్రవర్తి, సంస్థ అధ్యక్షులు డాక్టర్ రామరాజు శ్రీనివాస్‌లు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. జస్టిస్ ఏవీ శేషసాయి మాట్లాడుతూ ఆధునికత పేరుతో మన సంప్రదాయ కళారూపాలను విస్మరిస్తున్నారని అన్నారు. అటువంటి సమయంలో జాగరూకత చాలా అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు తమ పిల్లలను సంప్రదాయబద్ధంగా ఉండేలా కాపాడుకోవాలని అన్నారు. ఏ జాతి సంస్కృతీ, సంప్రదాయాలను మర్చిపోతే, ఆ జాతి వినాశనమయ్యేందుకు కారణమని చెప్పారు. సభానంతరం కర్ణాటక సంగీత పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

మజ్జిగ పంపిణీ..

గుంటూరు మెడికల్: కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయం వద్ద మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ షమా సుల్తానా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సోదర భావంతో మెలగాలన్నారు. దాదాపు రెండు వేల మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.